www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 9 మార్చి 2025



ఇంటర్ పరీక్షకు 16,025 మంది హాజరు

ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.యోహాన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం గణితం-బి, జంతుశాస్త్రం, చరిత్ర పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.యోహాన్ తెలిపారు. మొత్తం 55 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 16,997 మందికి 16,025 మంది హాజరయ్యారని, 972 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. 94 శాతం హాజరు నమోదైందని, సాధారణ విభాగంలో 14,407 మందికి 13,847 మంది హాజరవ్వగా 560 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. వృత్తి విద్యా విభాగంలో మొత్తం 2,590 మందికి 2,170 మంది హాజరవ్వగా 412 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు యోహాను తెలిపారు.

బెడ్స్ బెంగ.. వైద్యం అరకొర..!

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగుల కష్టాలు
బెడ్స్ లేవని విజయవాడ పంపడంపై ఆవేదన
వైద్యుల నియామకంపై పట్టించుకోని సర్కార్
ఐసియులోనూ సక్రమంగా అందని వైద్యం
మెడికల్ కాలేజీగా మార్పు చేశాక పరిస్థితి అధ్వానం
ఆసుపత్రి సమస్యలపై ప్రత్యేక సమావేశంపై డిఆర్‌సిలో నిర్ణయం
ఇప్పటికీ అతీగతీలేని పరిస్థితి
రోగుల బాధలపై ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది' అనే చందంగా ఏలూరు సర్వజన ఆసుపత్రి పరిస్థితి తయారైంది. వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఉన్నప్పుడు అద్భుతమైన వైద్య సేవలందించిన ఏలూరు జిల్లా ఆసుపత్రి, బోధనా ఆసుపత్రిగా మారిన తర్వాత అత్యంత దారుణంగా మారిందని జనం తలలు పట్టుకుంటున్నారు. సర్వజన ఆసుపత్రికి వెళ్లాలంటేనే రోగులు భయపడే పరిస్థితి తీసుకొచ్చారు. అత్యవసర వైద్యం కోసం సర్వజన ఆసుపత్రికి వెళ్లిన రోగులకు వైద్యులు మొదట చెప్పేమాట ఒక్కటే.. బెడ్స్ లేవు విజయవాడ, గుంటూరుకుగాని వెళ్లండని. రోగులు గట్టిగా నిలదీస్తే ఒక సెలైన్ పెట్టి వదిలేస్తున్నారు. దీంతో రోగుల బంధువులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంటుంది. ఆసుపత్రిలో బెడ్ ఇప్పించండంటూ రాజకీయ నాయకులకో.. లేక పలుకుబడి ఉన్నవారికో ఫోన్లు చేసి రోగి బంధువులు వేడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. బెడ్స్ ఖాళీగా ఉన్నా లేవని విజయవాడ రిఫర్ చేస్తున్నారని రోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు ఏదైనా అత్యవసర కేసులు తప్ప విజయవాడ, గుంటూరుకు రిఫర్ చేసేవారు కాదు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇక్కడ వైద్యం అందే కేసులను సైతం విజయవాడ వెళ్లిపోవాలని చెప్పేస్తున్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రతిరోజూ వెయ్యి నుంచి 1200 మంది రోగులు ఓపి సేవలు పొందుతుంటారు. 600 మందికిపైగా రోగులకు ఇన్‌పేషెంట్ సేవలు అందుతాయి. బోధనా ఆసుపత్రిలో రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలంటే 97 మంది వైద్యులు ఉండాలి. ప్రస్తుతం 35 మంది కూడా లేని పరిస్థితి. దీంతో రోగులకు వైద్యసేవలు అరకొరగా అందుతున్నాయి. సర్వజన ఆసుపత్రికి వెళ్తే



ఏలూరు సర్వజన ఆసుపత్రి

రోగం తగ్గి ఇంటికి వెళ్తామనే నమ్మకం జనంలో తగ్గిపోతుంది. ఐసియులో సైతం వైద్యసేవలు సరిగా అందడం లేదని రోగులు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. ఐసియులో వైద్యుల పర్యవేక్షణ సరిగా ఉండడం లేదని రోగులు గగ్గోలు పెడుతున్నారు. ఆసుపత్రిలో శుభ్రత విషయంలో మెరుగ్గా ఉన్నప్పటికీ వైద్యం విషయంలో మాత్రం రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోధనా ఆసుపత్రిలో వైద్యసేవలకు సంబంధించి పర్యవేక్షణ అంతా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఆధ్వర్యంలోనే ఉంటుంది. ప్రిన్సిపల్ సరిగా పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

మళ్లీ ప్రయివేటు ఆసుపత్రికి

సర్వజన ఆసుపత్రికి వచ్చిన రోగులు చాలా మంది సరైన వైద్యం అందక డిశ్చార్జి చేయించుకుని ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పేదలు ఆర్థికంగా నలిగిపోతున్నారు. బోధనా ఆసుపత్రిలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్లుగా ఉంటారు. వీరు రోగులతో సరిగా సఖ్యతగా ఉండటం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు సైతం వైద్యుల కొరత ఉండేది. ఇప్పుడు కంటే ఎక్కువ మంది రోగులు ఆసుపత్రికి వచ్చేవారు. అప్పుడు అందినట్లుగా ఇప్పుడు వైద్యసేవలు ఎందుకు అందడం లేదనే ప్రశ్నలు అందరినీ వేధిస్తున్నాయి. జిల్లా ఆసుపత్రిని మెడికల్ కాలేజీగా మార్పు చేసి ప్రజలకు వైద్యసేవలు సరిగా అందకుండా చేశారనే అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం సైతం సరిగా పట్టించుకోవడం లేదనే చర్చ జనాల్లో నడుస్తోంది.


డిఆర్‌సి సమావేశంలో నిర్ణయాల అమలేది..?

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై జనవరి 16న ఏలూరు గోదావరి సమావేశ మందిరంలో జరిగిన డిఆర్‌సి సమావేశంలో చర్చ జరిగింది. ప్రజాప్రతినిధులంతా ఆసుపత్రిలోని సమస్యలను ఏకరువు పెట్టారు. దీంతో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ సర్వజన ఆసుపత్రిలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, తాను కూడా ఉదయం విజిట్ చేశానని తెలిపారు. ఇప్పుడు పూర్తిస్థాయిలో చర్చకు సమయం లేదు కాబట్టి వారం, పది రోజుల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుందామని తెలిపారు. దాదాపు రెండు నెలలు గడిచిపోతుంది. ఇప్పటి వరకూ డిఆర్‌సి సమావేశంలో తీసుకున్న ప్రత్యేక సమావేశ నిర్ణయం ఏమైందో ఏఒక్కరికీ తెలీని పరిస్థితి. రోగుల బాధలు ప్రజాప్రతినిధులకు, అధికారులకు పట్టడం లేదా అనే చర్చ సాగుతోంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిని గాడిన పెట్టకపోతే జిల్లా ప్రజానీకం పరిస్థితి మున్ముందు మరింత దారుణంగా మారనుందనడంలో ఎటువంటి సందేహామూ అక్కర్లేదు.

మహిళల ఆర్థికాభివృద్ధి, భద్రతకు ప్రాధాన్యత

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

మహిళల ఆర్థికాభివృద్ధి, భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఏలూరులోని సిఆర్‌రెడ్డి కాలేజీలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి మహిళా దినోత్సవ వేడుకలను మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి, భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో 181 టోల్‌ఫ్రీ నెంబర్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. మహిళల భద్రతకు సంబంధించి, శాంతిభద్రతల విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. మహిళలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి రాష్ట్రంలో కోటి మందికిపైగా మహిళలకు దీపం-2 కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో నాణ్యమైన బియ్యంతో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. పార్లమెంట్లో ప్రవేశ పెట్టబోయే మహిళల అక్రమ రవాణా నిరోధక బిల్లుకు పూర్తిగా మద్దతు ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంతోపాటు మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. తొలుత రూ.131.82 కోట్ల చెక్కుల రూపంలో మంత్రి డ్వాక్రా సంఘాలకు అందజేశారు. అనంతరం డ్వాక్రా సంఘాల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పట్టా మహేష్ కుమార్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణ, మేయర్ నూర్జహాన్, ఆర్‌టిసి రీజియన్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.1 ఫోన్ పే చేయించుకుని రూ.98 వేలు స్వాహా

నారాయణపురంలో ఆగంతకుని సైబర్ మోసం

ప్రజాశక్తి - ఉంగుటూరు


నారాయణపురంలో మణి ఫుట్‌వేర్ కంగన్ హాల్ ఫ్యాన్సీ దుకాణం యజమానికి ఓ సైబర్ నేరస్తుడు టోకరా వేసి రూ.98 వేలు కాజేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి దుకాణ యజమాని నిడమోలు సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒక యువకుడు ఉదయం 10.35 గంటల సమయంలో వచ్చి పరీక్ష రాసే అట్టలు, పుస్తకాలు, పెన్నులు ఇతర వస్తువులను కొనుగోలు చేశారు. బిల్లు రూ.2800 అయ్యింది. ఫోన్‌పే చేస్తానని నమ్మించి షాపు యజమానిని రూ.1 ఫోన్‌పే చేయమన్నాడు. నమ్మిన సత్యనారాయణ తన ఫోన్‌పే నుంచి రూ.1 వేశాడు. సైబర్ నేరస్తుడు షాపు ఓనరుది ఫోను తీసుకుని స్కాన్ చేసి సరుకులు తీస్తుండండి, ముందుకెళ్లొస్తానని బయటకు వెళ్లాడు. మరుక్షణంలోనే దుకాణం యజమాని బ్యాంకు ఖాతా నుండి రూ.98 వేలు డెబిట్ అయినట్లు ఫోన్‌కు మెసేజీ వచ్చింది. దీంతో మోసపోయినట్లు తెలుసుకుని బాధితుడు వెంటనే పోలీసులకు, సైబర్ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక సీసీ కెమెరాల్లో ఆ అగంతకుడి ఆనవాళ్లను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి
ప్రజా చైతన్య సైకిల్ యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నగరంలో అసంపూర్తిగా ఉన్న దాదాపు 17 వేల టిడ్కో ఇళ్లను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. పది సంవత్సరాలుగా టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయయని, ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప లబ్ధిదారులకు ఇళ్లు అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆ పార్టీ బృందం శనివారం కొత్తూరులోని అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను సందర్శించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు కేటాయిస్తామని పది సంవత్సరాల క్రితం


నూజివీడు: టిడ్కో ఇళ్లు పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

ప్రజల వద్ద నుండి రూ.కోట్లు వసూలు చేశారని, బ్యాంకు రుణాల నిమిత్తం ఒప్పందాలు కూడా చేశారని, అయితే నేటికీ ఏఒక్కరికీ ఒక్క ఇల్లు కూడా కేటాయించలేదని తెలిపారు. మరోపక్క బ్యాంక్ అధికారులు ఒప్పందాలు కుదుర్చుకున్న లబ్ధిదారులకు వడ్డీలు కట్టాలని నోటీసులు పంపిస్తూ ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. లబ్ధిదారులకు అటు ఇళ్లు కేటాయించక, ఇటు వడ్డీలు కట్టుకోలేక, అద్దె ఇళ్లలో అద్దె కట్టుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. రూ.వందల కోట్లు ప్రజాధనం దుర్వినియోగమైందని, ఇది చాలా బాధ్యతారాహిత్యమని, ప్రభుత్వం ఇప్పటికైనా సరే వెంటనే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్లను, వృధాగా పడి ఉన్న మెటీరియల్‌ను సిపిఎం బృందం పరిశీలించింది. ఏప్రిల్ నెలాఖరులోగా టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించని పక్షంలో ఇళ్ల స్వాధీన ఉద్యమం చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎం నగర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో వేలాది మంది పేదలు సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో కాపురం ఉంటున్నారన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణ నిమిత్తం డబ్బులు కూడా చెల్లించి అద్దె చెల్లించుకోవాల్సిన దుస్థితిలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. తెలుగుదేశం కూటమి ఎన్నికలకు ముందు టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పిందని, తొమ్మిది మాసాలు గడుస్తున్నా సరే ఇళ్ల నిర్మాణం పనులు అలాగే ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కె.శ్రీనివాస్, కె.విజయలక్ష్మి, కె.లెనిన్, నగర నాయకులు వైఎస్.కనకారావు, ఎం.ఇస్సాక్, బి.సోమయ్య, ఎం.సత్యనారాయణ, పి.ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.


ఏలూరు: టిడ్కో ఇళ్ల వద్ద నిరుపయోగంగా ఉన్న మెటీరియల్‌ను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

నూజివీడు టౌన్: పట్టణ పరిధిలోని డాక్టర్ ఎంఆర్.అప్పారావు కాలనీలోని టిడ్కో ఇళ్లను సిపిఎం పట్టణ బృందం శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్లు, నేత ఎన్.పద్మాంజలి మాట్లాడుతూ పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామని పాలకులు మాట ఇచ్చి 11 ఏళ్లు దాటిందన్నారు. 2014లో వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందని, ఇప్పటికీ పూర్తి చేయలేదని అన్నారు. గత వైసిపి పాలకులు వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా ఇప్పటివరకు పేదలకు ఇస్తామన్నా ఇంటి విషయంలో నోరు మెదపడం లేదన్నారు. ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇస్తుందనే నమ్మకంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు లక్షలాది రూపాయలు డిపాజిట్లుగా కట్టారన్నారు. లబ్ధిదారులకు అందించే ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. పాలకులు స్పందించకపోతే లబ్ధిదారులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో సమస్యలు పరిష్కరించండి

12న మహాధర్నా
వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి

ప్రజాశక్తి - పెదవేగి


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నేతలు

వంద రోజులు ఉపాధి పని పూర్తి చేసుకున్న గ్రామీణ పేదలకు అదనంగా పని దినాలు, సమ్మర్ అలవెన్స్, పేస్లిప్పులు, పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి డిమాండ్ చేశారు. పెదవేగి మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో శనివారం ఉపాధి పనులు చేస్తున్న ఉపాధి కూలీల దగ్గరికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సంక్షేమం కోసం పని చేస్తామని చెబుతున్న కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. రెండు కోట్ల మంది పేదలు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారన్నారు. వీరికి సొంత ఆస్తులు లేక చదువుకున్న వారికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక నిత్యం పొట్టకూటి కోసం ఏ పని దొరికుతే ఆ పనికి వెళ్తున్నారన్నారు. డిగ్రీ, పీజీ చదువుకున్న నిరుద్యోగులు ఆటో, భవన నిర్మాణ ఉపాధి పనులకు వెళ్తున్నారన్నారు. ఆ పనుల్లో కూడా పోటీ పెరిగి చేతినిండా పని దొరకక సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలసలను నివారించి ఉపాధి హామీ పని 200 రోజులకు పెంపు చేయాలని కోరారు. వలస కార్మికులకు ఉచితంగా రవాణా సౌకర్యం, బియ్యం, గ్యాస్‌బండ అందించాలన్నారు. ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షల నగదు, రెండెకరాల భూమి ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి మార్చి 12వ తేదీన విజయవాడలో మహాధర్నా నిర్వహించనునట్లు తెలిపారు. ఈ మహాధర్నాలో అధిక సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పోలీసుల సేవలు అభినందనీయం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్
మహిళా పోలీస్ డార్మెటరీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజల కోసం పోలీసులు అందించే సేవలు ఎప్పుడూ అభినందనీయమని, వారి సేవలు వెలకట్టలేనివని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఏలూరు ఎంపీ ల్యాండ్ నిధుల నుంచి కేటాయించిన రూ.64.80 లక్షలతో నిర్మించనున్న మహిళా పోలీస్ డార్మెటరీ భవన నిర్మాణానికి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళా పోలీస్ డార్మెటరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఎస్‌పి ప్రజా రక్షణ కోసం శ్రమిస్తున్న పోలీసులకు తన వంతు సహాయం చేయాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ భవన నిర్మాణానికి ఎంపీ ల్యాండ్ నుంచి రూ.64.80 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఏలూరు రేంజ్ డిఐజి ఐజి జివిజి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎటువంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా ఉత్తమ సేవలందించేందుకు పోలీసు సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. ఏలూరు రేంజ్‌లోని మహిళలందరికీ ఆయన అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ మాట్లాడుతూ మహిళా పోలీస్ సిబ్బందికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా పోలీస్ డార్మెటరీ నిర్మాణానికి నిధులు కేటాయించిన ఎంపీ మహేష్ కుమార్‌కు మహిళా పోలీసు సిబ్బంది, హోంగార్డుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.


భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి మనోహర్

విదేశీ కోకో గింజల దిగుమతులు ఆపాలి

రైతులు వద్ద ఉన్న కోకో గింజలు కొనుగోలు చేయాలి
కోకో రైతుల సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - పెదవేగి

విదేశీ కోకో గింజల దిగుమతులు వెంటనే నిలుపుదల చేయాలని, రైతుల వద్ద నిల్వ ఉన్న కోకో గింజలు వెంటనే కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. విజయరాయి, గాంధీనగర్ షిరిడి సాయి కళ్యాణ మండపంలో కోకో రైతుల ప్రాంతీయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విదేశాల నుండి కోకో గింజలు దిగుమతి చేసుకున్నామని, రైతులు వద్ద నుంచి తగినంతగా కోకో గింజలు కొనుగోలు చేయలేమని కొన్ని కంపెనీలు రైతులను బెదిరించడం తగదన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇవ్వకుండా కంపెనీలు రైతులను మోసగిస్తూ ఇబ్బందులు గురి చేయడం అన్యాయమని విమర్శించారు. కిలో కోకో గింజలకు రూ.900 ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 6న జరిగిన కోకో రైతుల చలో ఏలూరు కార్యక్రమం సందర్భంగా కోకో రైతుల సమస్యలను జిల్లా కలెక్టర్‌కు వివరించామని చెప్పారు. ఈనెల 10వ తేదీన ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ దృష్టికి కోకో రైతుల కొనుగోలు సమస్యలు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఉద్యాన శాఖ కమిషనర్ కార్యాలయం వద్దకు కోకో రైతులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో కోకో రైతుల రాష్ట్ర సదస్సును జరుపుతామని, కోకో రైతుల కొనుగోలు సమస్య పరిష్కారమయ్యేవరకూ పోరాడుతామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కంపెనీలు కోకో గింజలు కొనుగోలు చేసే విధంగా, అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు బొల్లు రామకృష్ణ, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షులు మున్నంగి సుబ్బారెడ్డి, కోనేరు సతీష్, గుడిబండి రమేష్‌రెడ్డి, ఎ.అనిల్‌కుమార్, కె.రామిరెడ్డి, కె.గోపాలరెడ్డి, పలువురు కోకో రైతులు పాల్గొన్నారు.

ఫలితాలొచ్చాయి.. పనులే మిగిలాయి..!



గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల ఫలితాలు వెలువడటంతో ఎన్నికల కోడ్ తొలగిపోయింది. కోడ్ పేరిట ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన పనులే మిగిలాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక రెండు జిల్లాల్లో వేసవి తీవ్రత నేపథ్యంలో తాగు, సాగునీటి సమస్యలు తెరపైకొస్తున్నాయి.

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపొందారు. అయితే ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి ఫలితాలు వెల్లడయ్యే వరకూ గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లా అధికారుల తీరు చర్చనీయాంశమైంది. ప్రధానంగా కౌంటింగ్ ముందు రోజు వరకూ సిబ్బందికి శిక్షణ, అభ్యర్థుల సమావేశాల్లో అంకెలు తప్ప ఎటువంటి రౌండ్లు, గీతలు గీచినా ఓటు చెల్లదని చెప్పిన అధికారులు కౌంటింగ్ ప్రారంభంలో మాటమార్చారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. రౌండ్ చేసినా ఇబ్బంది లేదని, రోమన్ అంకెలను సైతం అంగీకరించొచ్చని మౌఖిక ఆదేశాలివ్వడం కౌంటింగ్ ఏజెంట్ల మధ్య వాగ్వివాదానికి దారితీసిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఈ తరహా మార్పులు కౌంటింగ్ ముందు ఎలా ప్రకటిస్తారనేది సందేహాస్పదమే. ఎన్నికల మాన్యువల్ ప్రకారం కూడా ఇది సరికాదనేది అందరికీ తెలిసిందే. దీనికితోడు కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ ఒక రీతిగా సాగగా, గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ మరో రీతిగా సాగింది. దీనివల్ల ఇక్కడి ఎంఎల్‌సి ఎన్నిక ఫలితం రావడానికి 30 గంటలకుపైగా పట్టింది. మరి ఎన్నికల సంఘం వేర్వేరు విధానాల్లో కౌంటింగ్ ఎలా అనుమతిచ్చిందనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. ఇదే కాదు కోడ్ అమలులోనూ అధికార పక్షానికి అనుకూలంగా అధికార యంత్రాంగం వ్యవహరించిందనే విమర్శలు మొదట్లో విన్పించాయి. పోలింగ్ రోజున కూడా ఒరిజినల్ గుర్తింపు పత్రం లేకుండా జిరాక్స్ తీసుకొచ్చినా ఓటింగ్ ఎలా అనుమతించారనేది ఎవరికీ అర్థం కాని విషయంగా మిగిలింది. ఇక పోలింగ్ కేంద్రాల్లోకి ప్రజాప్రతినిధులు గుంపులుగా వెళ్లినా జిల్లా అధికారులు సైతం స్పందించకపోవడం, పోలింగ్ కేంద్రాల వద్దే అధికార పార్టీ వారు ప్రత్యర్థి ఏజెంట్లపై దాడికి తెగబడుతున్నా పోలీసులు చోద్యం చూడటం చర్చనీయాంశమైంది. ఇదే కాదు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓట్ల నమోదులోనూ అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు చెప్పిన చోటుకు మండలస్థాయి అధికారులు సైతం వెళ్లి ఓటు ఎలా నమోదు చేయాలో వివరించడంతోపాటు ఓటర్ల నమోదు చేపట్టడంపై నాడే విమర్శలు వెల్లువెత్తాయి. మొత్తంగా గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల తీరు చూస్తే ఎవరు గెలిచారు.. ఎవరు ఓడారు అనేదానికన్నా అధికార యంత్రాంగం తీరే చర్చనీయాంశమైందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

ఎన్నికల కోడ్ ముగియడంతో ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ప్రారంభం కానుంది. దీనికి వినతులు పెద్దసంఖ్యలో వెల్లువెత్తే అవకాశం ఉంది. ఈలోపుగానే రైతులను సాగునీటి కొరత వెంటాడుతోంది. రెండు జిల్లాల్లోనూ ఆయకట్టు శివారు, కాల్వ శివారు భూములకు సాగునీరందక ఎండిపోతున్న పరిస్థితి పలుచోట్ల ఉంది. సాక్షాత్తూ జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు సొంత జిల్లాలోనే ఆచంట, నరసాపురం తదితర ప్రాంతాల్లో సాగునీటి ఎద్దడి స్పష్టంగా కన్పిస్తోంది. ఏలూరు జిల్లాలోనూ ఈ పరిస్థితి ఉంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు రంగంలోకి దిగితే తప్ప రైతుల సాగునీటి కష్టాలు గట్టెక్కే అవకాశం కన్పించడం లేదు. ఇక వేసవి ఎండల తీవ్రత మార్చి మొదటి వారంలో చాలా ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో తాగునీటి విషయంలో మరింత అప్రమత్తత అవసరం. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు దీనిపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. దీనికి అవసరమైన నిధులు ఇవ్వడంతోపాటు పనులన్నీ సక్రమంగా పూర్తయ్యేలా జిల్లా అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి. మరి జిల్లా అధికారులు ఈ వేసవిలో జిల్లావాసుల దాహార్తి ఎలా తీరుస్తారో వేచిచూడాల్సి ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

- వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

రాజీమార్గమే రాజ మార్గం

15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాజీ మార్గమే కక్షిదారులకు రాజమార్గమని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ అన్నారు. పట్టణంలోని కోర్టు భవన సముదాయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ మాట్లాడుతూ రాజీమార్గం ఒక్కటే రాజమార్గంగా గుర్తించాలన్నారు. రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. రాజీ పడదగిన అన్ని సివిల్, క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే చక్కని అవకాశం ఉన్నట్లు చెప్పారు. ఇందుకోసం మూడు ప్రత్యేక బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 228 కేసులు రాజీకి వచ్చి పరిష్కారమయ్యాయి. వీటిలో సివిల్ కేసులు 31, క్రిమినల్ కేసులు 147, ఎస్‌టిసి 35, బ్యాంక్ పిఎల్‌సి 15 కేసులు రాజీకి వచ్చాయని చెప్పారు. వీటి ద్వారా రూ.1,25,44,960 చెల్లించినట్లు తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె పెద్ద ఖాసీం, సెకండ్ అడిషనల్ సివిల్ జడ్జి ఎం.శివపార్వతిలు రాజీకి వచ్చిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించారు.

మెగా లోక్ అదాలత్‌లో 177 కేసులు పరిష్కారం

జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 177 కేసులు పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్‌లో క్రిమినల్ సివిల్ బ్యాంక్ రికవరీ చెక్ బౌన్స్, బిఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదాలు, మనోవర్తి, ప్రామిసరీ నోటు మొత్తం కలిపి 177 కేసులు, తొమ్మిది సివిల్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌కు సంబంధించిన 23 కేసుల్లో ఇతర కేసుల రికవరీ కలిపి మొత్తం రూ.43,80,580 అపరాధ రుసుము చలానా ద్వారా ప్రభుత్వం వారికి చెల్లించి అన్ని కేసులను కాంపౌండ్ చేసినట్లు తెలిపారు. కేసు రాజీ చేసుకునేవారు కోసం ప్రతిరోజూ ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నారన్నారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, ఎపిపి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం ఆర్ఒ వాటర్ ప్లాంట్‌లను ప్రారంభించనున్నట్లు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు తెలిపారు. మండలంలోని బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో తపన చౌదరితో కలిసి నూతన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని ప్రజలు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని ఎంఎల్ఎ దృష్టికి తీసుకురాగా తపన ఫౌండేషన్ సహాయంతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో ఇంకొన్ని ప్రాంతాల్లో వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు జి.రవికుమార్, ఎస్.సాయి, పి.రాము, ఎంపిటిసి సభ్యులు నాలి శ్రీను, జి.రాంబాబు, ప్రసాద్, కాంచనమాల, జనార్దన్ పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వేసవిలో దాహార్తి తీర్చడానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని గ్రామ సర్పంచి ఎ.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని రామానుజపురంలో ఎక్కడెక్కడ పైప్‌లైన్ లీకేజీలు ఉన్నాయో ముందుగా గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామంలో తాగునీటికి ఎలాంటి ఆటంకం లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శివారు ప్రాంతాలకు తాగునీరు సరఫరా జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. షెడ్యూల్ ప్రకారం ఓవర్‌హెడ్, మంచినీటి ట్యాంకులను శుభ్రం చేస్తామని తెలిపారు.

మృతుని కుటుంబానికి నష్ట పరిహారం అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండల పరిధిలోని ఈదర గ్రామంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన చిట్టిబోతుల రామకృష్ణ కుటుంబానికి విద్యుత్‌శాఖ వారు అందించిన నష్టపరిహారం రూ.ఐదు లక్షలు మృతుడి భార్యకు అందించారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మృతుడి భార్య త్రివేణికి శనివారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో అందించారు. సదరు షెడ్యూల్ తెగ కుటుంబానికి న్యాయం చేయడానికి సంబంధిత పత్రాలను ఆయా శాఖల అధికారులకు సమర్పించి, ఆ కుటుంబానికి నష్ట పరిహారం రావడానికి కృషి చేసిన బిజెపి నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త జిఆర్.కె.రంగారావును గ్రామస్తులు అభినందించారు. మృతుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌గా కృష్ణ

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని కోరుకొల్లు వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌గా చెన్నంశెట్టి కృష్ణ నియమితులయ్యారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఉయ్యూరులో జరిగిన రెండో కేబినెట్ సమావేశంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ వాకర్ ప్లాటినం డోనర్ ఎం.ఎం.వి ప్రభాకర్, జిల్లా గవర్నర్ వాకర్ గోల్డ్ డోనర్ సనక సుబ్బారావు సమక్షంలో నియామక పత్రాలు అందుకున్నట్లు ఎంపికైన ప్రెసిడెంట్ చెన్నంశెట్టి కృష్ణ, కార్యదర్శి గొర్ల వెంకటకృష్ణకుమారి, కోశాధికారి చెన్నంశెట్టి సుబ్బలక్ష్మి తెలిపారు.

10, 17, 24 తేదీల్లో విధుల బహిష్కరణ

ఎపి వైద్యమిత్ర కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ ప్రధాన అధికారుల నుంచి ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించకపోవడంతో ఈ నెల 10, 17, 24 తేదీల్లో మూడు రోజులు సాయంకాలం విధులను బహిష్కరిస్తున్నట్లు ఎపి వైద్యమిత్ర కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ వారు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ట్రస్ట్ పీల్ సిబ్బందికి నిర్వహించిన వన్ టైం పరీక్షను ఉప సంహరించుకోవాలని, రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగం వారికి రూ.10 లక్షల గ్రాంట్ ఇవ్వాలని వంటి అనేక ప్రధాన డిమాండ్లను ఎన్‌టిఆర్ ట్రస్ట్ సేవా సిబ్బంది వారు, ప్రభుత్వం వారు త్వరగా పరిష్కరించాలని పేర్కొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి- ద్వారకాతిరుమల

మండలంలోని పంగిడిగూడెం, ద్వారకాతిరుమల, రాళ్లకుంట, కొమ్మర, కొడిగూడెం, జి.కొత్తపల్లి, రామసింగవరం గ్రామాల్లో లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. గోపాలపురం ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా హాజరై ఈ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు లంకా సత్యనారాయణ, మండల నాయకులు పాకలపాటి గాంధీ, ఏపూరి దాలయ్య, దేవరపల్లి వీరాస్వామి చౌదరి, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, మద్దాల రాము, మట్టపర్తి రూపేష్ కుమార్, మొగతడకల ఓం ప్రకాష్, రేగింటి రాంబాబు, జనసేన మండలాధ్యక్షులు దాకారపు నరసింహమూర్తి, బిజెపి మండలాధ్యక్షులు చిలక వీరస్వామి, జెడ్‌పిటిసి సభ్యులు శామ్యూల్, రాచమంటి రాజు, సర్పంచి కస్సె శ్రీహరి



చెక్కులు అందిస్తున్న ఎంఎల్ఎ

నేరాలు - ఘోరాలు

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని హనుమంతులగూడెం గ్రామంలో నాటుసారా స్థావరంపై శనివారం దాడి చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ దాడిలో ఒగిరెలతండా గ్రామానికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అతనికి సారా తయారీకి సహకరిస్తున్న ఇద్దరి అన్నపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆగిరిపల్లి, నూజివీడు, ముసునూరు, చాట్రాయి మండలాల్లో బెల్ట్ షాపులు నిర్వహించినా, నాటుసారా తయారుచేసినా, అమ్మినా, కలిగి ఉన్నా నేరమన్నారు. నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం సరఫరా చేసే వ్యాపారులపై బెల్లపు ఊట కలిగి ఉన్న భూ యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఐటువంటి సమాచారం తెలిస్తే ఎక్సైజ్ సిఐ 9440902462కు సమాచారం అందించాలని తెలిపారు.

200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం


కుక్కునూరు : నాటుసారా స్థావరంపై దాడి చేసిన పోలీసులు బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కుక్కునూరు మండల పరిధిలోని వేలేరు గ్రామ శివారులో కుక్కునూరు సిఐ ఎం.వెంకటేశ్వరరావు తన సిబ్బందితో శనివారం దాడి చేశారు. ఈ దాడిలో సుమారు 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నాటు సారా తయారీ పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళలే స్వర్ణాంధ్ర నిర్మాతలు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మహిళలే స్వర్ణాంధ్ర నిర్మాతలని, భూమి నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లోనూ పురుషులకంటే మిన్నగా మహిళలు తమ సత్తాను చాటుతున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నూజివీడు పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచస్థాయి కార్పొరేట్ సంస్థలను మహిళలు ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన మహిళలను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు పురపాలక సంఘం మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ బొబ్బిలి ఝాన్సీరాణి, రేమన్నపూడి నాగమణి, కొంపల్లి కృష్ణకుమారి, వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



కుక్కునూరులో...

నూజివీడు కోర్టు ఆవరణలో 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెకండ్ అడిషనల్ సివిల్ జడ్జి ఎం.శివపార్వతి, ఎపిపి ప్రసన్న, మహిళ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. పురపాలక సంఘ కార్యాలయం నుంచి చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఆర్‌జియుకెటి నూజివీడు ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి సంఘసంస్కర్త భారతీయం సత్యవాణి ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన, థీమ్ ప్రదర్శనలు ముఖ్య ఆకర్షణగా నిలిచాయి. మహిళా దినోత్సవం భాగంగా ఉపాధ్యాయులకు, విద్యార్థినులకు, హౌస్ కీపింగ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది మొదలుగు వారికి ఆటల పోటీలు నిర్వహించారు.

ఏలూరు స్పోర్ట్స్ : నగరంలోని సురేష్ బహుగుణ పోలీసు ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మహిళా దినోత్స వాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించారు. విద్యార్థులకు ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ప్రశంసపత్రాలు అందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పనిచేస్తున్న హోంగార్డులకు, మహిళ పోలీసు సిబ్బందికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

జీలుగుమిల్లి : సమాజాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం పలువురు డ్వాక్రా మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఝాన్సి, సీసీలు బోస్, అరుణ, సత్యనారాయణ, విఒఎలు పాల్గొన్నారు.

భీమడోలు : పొలసానిపల్లికి ప్లాస్టిక్ వినియోగ నిషేధిత గ్రామంగా గుర్తింపు తేవడం, పంచాయతీ పరిధిలో పర్యావరణహితమైన కార్యక్రమాలను



నూజివీడు టౌన్ : మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

చేపడుతున్న సర్పంచి షేక్ రహీమా బేగం హసేన ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని ఎంపిడిఒ పద్మావతి దేవి అన్నారు. గ్రామ సర్పంచి, గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శనివారం గ్రామ మహిళలకు పురస్కారం పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ శాఖలు విభాగాల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఇదే క్రమంలో గ్రామ సర్పంచితో పాటు గ్రామపంచాయతీ పరిధిలోని మహిళా ప్రజాప్రతినిధులు, ప్రముఖులను సత్కరించారు. కార్యక్రమానికి అతిథి గా ఎంపిటిసి సభ్యురాలు అంబటి దేవి నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ఎంపిడిఒను ప్రత్యేకంగా సన్మానించారు.

ముసునూరు : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ప్రేరణాలయ సిస్టర్ సుధారాణి అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు ప్రేరణాలయ సోషల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించిన వేడుకల్లో సుధారాణి మాట్లాడుతూ అన్ని రంగాల్లో పురుషులతో పాటు మహిళలు సమానంగా ముందంజలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ప్రతాప్, ఎంపిపి కొండా దుర్గాభవాని, ప్రధానోపాధ్యాయులు ఎం.వాణి, అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, ఆశాలు, పకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది, సోషల్ డెవలప్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : అంతర్జాతీయంగా మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా విజయాలు సాధిస్తున్నారని సిపిఎం నాయకులు సూర్యకుమార్, మానవత ఛైర్మన్ ఎ.అప్పారావు, కన్వీనర్ కె.నాగచిన్నారావు అన్నారు. చింతలపూడి నగరపంచాయతీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చింతలపూడి శాఖ ఆధ్వర్యంలో చింతలపూడి నగర పంచా యతీ కమిషనర్ డి.పావనిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నేత ఎం.వరలక్ష్మిదేవి, మహిళా సంఘం నాయకులు కురిసెట్టి అనురాధ, గోపీలక్ష్మి, సిఐటియు నాయకులు ఆర్‌విఎస్.నారాయణ, నత్తా వెంకటేశ్వరరావు, ధర్మారావు, జన విజ్ఞాన వేదిక నాయకులు పి.పాండు రంగారావు, సూర్యకుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ప్రమాద్వరను, డిప్యూటీ తహశీల్దార్ షకీలాను, ఆర్ఐ కాంతమ్మను టిడిపి నాయకులు థామస్, బోడ అనీష్‌కుమార్ సత్కరించారు.


చాట్రాయి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో వెలుగు కార్యాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ సిబ్బంది పాల్గొన్నారు. ఎంపిపి లంక నిర్మల మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. మహిళలకు కుర్చీలాట, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి వెలుగు కార్యాలయంలో వెలుగు, ఐసిడిఎస్ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా టిడిపి నూజివీడు నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. వెలుగు ఎపిఎం డి.రాజశేఖర్, ఎసి త్రిపుర సుందరరావు, భాగ్యలక్ష్మి ఇండేన్ గ్యాస్ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ పివి.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి బి.ప్రసాద్, టిడిపి నాయకులు సిహెచ్.విక్టర్‌బాబు, జోషిబాబు పాల్గొన్నారు. ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా దినోత్సవ వేడుకలను వైద్యాధికారి జె.జగన్మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి సిహెచ్.లక్ష్మీవిక్టర్‌బాబుతో సహ పలువురు మహిళా వైద్య సిబ్బందిని సన్మానించారు. స్థానిక ఎస్‌ఆర్‌ఐ కళాశాలలో ఉమెన్ ప్రొటెక్షన్, గ్రీవెన్ సెల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కొయ్యలగూడెం : పరింపూడి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వివిధ సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎన్.ఉమాదేవి , మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. టిడిపి నేత గంగ్గిరెడ్ల మేఘలదేవి ఇంటి వద్ద కూటమి మహిళలందరు కేక్ కట్ చేశారు. పరింపూడి సర్పంచి ముప్పిడి విజయకుమారి ఆధ్వర్యంలో మహిళా పారి శుధ్య కార్మికులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారికి ప్రశంసాపత్రాలు, నూతన దుస్తులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని ప్రకాష్ నగర్ షాలేము చర్చిలో ఫైర్ ప్రేయర్ టీం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 21 మంది మహిళా సేవకురాళ్లను శాలువాతో సత్కరించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ప్రేయర్ టీం గౌరవ అధ్యక్షులు కురసం నిరీక్షణరావు, సిహెచ్.హెూషేయ, అధ్యక్షులు జి.జ్ఞాన్‌రాజు, సిహెచ్.రమేష్, పాల్ చిన్నారావు, టి.ప్రసన్నకుమార్, బి.జోసెఫ్, సిహెచ్.రాణి, లలిత, భారతి, మణికుమారి, సిహెచ్.రాణి, వాణి, తదితరులు పాల్గొన్నారు.


కుక్కునూరు : స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో కేక్ కట్ చేసి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కోశాధికారి బాడీస సుజాత మాట్లాడారు. ఈ సదస్సులో సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, మండల ఉపాధ్యక్షులు షేక్ వలీపాషా, నాయకులు మహమ్మద్ వలీపాషా, రమణ, భవాని, సౌజన్య, లక్ష్మీకాంత, జానకి, జ్యోతి, నాగలక్ష్మి, అన్నపూర్ణ, మాధవి, వసంత పాల్గొన్నారు. కుక్కునూరు పంచాయతీ ఉప సర్పంచి పిచ్చుక రాజు తన తల్లిని, భార్యను, కోడలిని శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పిచ్చుక రాజు మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజున మాత్రమే కాకుండా ప్రతిరోజు ప్రతిక్షణం మహిళలను గౌరవించాలన్నారు.



నారా భువనేశ్వరిచే జెస్సిరాజ్‌కు ఘన సన్మానం

దెందులూరు : అంతర్జాతీయ అర్టిస్టిక్ స్కేటర్ జెస్సిరాజ్‌ను అమరావతిలో శనివారం నిర్వహించిన మహిళా దినోత్సవం కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. జెస్సిరాజ్ వంటి ప్రతిభావంతులు మహిళలకు స్ఫూర్తిదాయకమని భువనేశ్వరి పేర్కొన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి.

నిడమర్రు : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి ధనుకొండ ఆదిలక్ష్మి, ఎంపిడిఒ విజయకుమారిలతో పాటు మండలంలోని మహిళా సర్పంచులు, మహిళా అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిడమర్రు సర్పంచి ఉమా మహేశ్వరరావు, అడవికొలను ఎంపిటిసి సభ్యులు దొరబాబు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.



భీమడోలులో...

ఉంగుటూరు : నారాయణపురం సర్పంచి దిడ్ల అలకనంద ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. చేబ్రోలు సర్పంచి రాంథే లక్ష్మీసునీత, కూటమి నాయకులు శరణాల మాలతీరాణి, శ్యామల, మహిళా ప్రజాప్రతిని ధులు, వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : మండలంలోని పంగిడిగూడెంలో మండల వెలుగు డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు హాజరయ్యారు. అనంతరం కేక్ కట్ చేసి మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు లంక సత్యనారాయణ, మండల వెలుగు ఎపిఎం అరవిందమ్మ, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

దెందులూరు : ఏలూరు దొండపాడులో ఉన్న ఉమా ఎడ్యుకేషన్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం, పరివర్తన్ బదిరుల పాఠశాల సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచలకులు బి.రామ్‌కుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గారపాటి ప్రకాశ్‌రావు హాజరయ్యారు. పాఠశాల సిబ్బంది జి.కోమలి, ఇ.కనకమహాలక్ష్మిలను సత్కరించారు.

కలిదిండి : మండలంలోని మట్టగుంటలో అంగన్వాడీ, ఆశా, మహిళా ప్రజా ప్రతినిధులను శాలువాతో సత్కరించి, మెమోంటోలు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు మాట్లాడారు. సర్పంచి అంద్రాజు రత్నమణి, ఎంపిటిసి ఒడుగు స్వరూప రాణి, ఉపసర్పంచి కోకా సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ అవార్డులు

ముదినేపల్లి : ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు అంగన్వాడీ కార్యకర్తలు ఉత్తమ ప్రతిభ అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. మండలంలోని అల్లూరుకు చెందిన అంగన్వాడీ కార్యకర్త సిహెచ్.భాగ్యలక్ష్మి, సింగరాయపాలేనికి చెందిన అంగన్వాడి కార్యకర్త వి.రత్నతులసి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభా అవార్డులను, ప్రశంసాపత్రాలను కైకలూరు ఐసిడిఎస్ సిడిపిఒ డాక్టర్ వి.దీప్తి, సూపర్‌వైజర్లు ప్రసూన, ఝాన్సీ చేతుల మీదుగా అందుకున్నారు.

నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టాలి

అధికారులకు ఎంపీ మహేష్‌కుమార్ ఆదేశాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ప్రారంభించే అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాల మేరకు చేపట్టాలని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం డిఇ ఫణిభూషణ్, ఇతర అధికారులు శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంపీ మహేష్‌కుమార్‌ను కలిసి ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఆయా అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన ఎంపీ మహేష్‌కుమార్ పలు సూచనలు చేశారు. పది కాలాల పాటు మన్నాల్సిన అభివృద్ధి పనుల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడవద్దని, నాసిరకంగా జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తే మాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ మహేష్‌కుమార్

విద్యార్థులకు ఉచిత కంప్యూటర కోర్సు

ప్రజాశక్తి -ముసునూరు

చదువు మధ్యలో ఆగిపోయి ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు కంప్యూటర్ కోర్స్ నేర్పటం ఆనందాయకమని ఎంపిపి కొండా దుర్గాభవాని వెంకట్రావు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో ప్రేరణాలయ సోషల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 11 మంది విద్యార్థులకు సిస్టర్ సుధారాణి ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్స్ సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు ఉచితం కంప్యూటర్ శిక్షణ ఆరు నెలల కోర్సు, సంవత్సరం కోర్సు ప్రేరణాలయ సోషల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నేర్పడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ప్రతాప్, ప్రధానోపాధ్యాయులు ఎం.వాణి, వైద్యులు షకీనా ఇవాంజెలిన్, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లతో విద్యార్థులు

సామాజిక భవనానికి కుర్చీల వితరణ



సామాజిక భవనానికి కుర్చీలు అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి - భీమడోలు

పొలసానిపల్లి గ్రామంలో శివాలయం ఎదుట సామాజిక భవన నిర్మాణాన్ని గతంలో చేపట్టి పూర్తి చేశారు. సౌకర్యాల కల్పనను మర్చిపోయారు. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో వివిధ కార్యక్రమాల కోసం పొలసానిపల్లి వచ్చే అధికారులు, నాయకులు తమ కార్యక్రమాలను అక్కడే నిర్వహిస్తున్నారు. దీనిలో పాల్గొనేందుకు వచ్చేవారు, స్థానికులు ఒకింత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సమస్య గ్రామ సర్పంచి దంపతులు షేక్ రహీమా బేగం హసేన, పారిశ్రామికవేత్త షేక్ హసేన దృష్టికి వచ్చింది. దీనిపై స్పందించిన సర్పంచి దంపతులు శనివారం సామాజిక భవనంలో వినియోగం కోసం 20 కుర్చీలను కూటమి నాయకులు గంజి సుబ్బారావు చేతుల మీదుగా అందించారు. టిడిపి గ్రామ కార్యదర్శి గోపాలకృష్ణ పది కుర్చీలను తన వంతు వితరణగా సమకూర్చారు. ఇదే క్రమంలో టిడిపి నాయకులు ఉండి పెద్దిరాజు సీలింగ్ ఫ్యాన్‌ను ప్రముఖుల చేతుల మీదుగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పద్మావతి దేవి, గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణతో పాటు కూటమి నాయకులు గోవింద్, రాంబాబు, శివన్నారాయణ పాల్గొన్నారు. సామాజిక భవనానికి కనీస వసతుల కల్పనకు ముందుకు వచ్చిన దాతలను పలువురు అభినందించారు.

చేపల చెరువులకు నీటిని వదలాలి

ఎంపీ మహేష్‌కుమార్‌ను కోరిన రైతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వేసవి తీవ్రత నేపథ్యంలో నీటి కొరతను అధిగమించడానికి వీలుగా చేపల చెరువులకు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను రైతులు కోరారు. ఈ మేరకు ఎంపీని స్థానిక క్యాంపు కార్యాలయంలో రైతులు శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నీటి కొరత కారణంగా జిల్లాలో చేపల సాగు చేస్తున్న తాము ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చేపల చెరువుల్లో తగిన స్థాయిలో నీటి నిల్వ లేకపోతే ఉత్పత్తి గణనీయంగా పడిపోవడానికి అవకాశం ఉందని ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం జిల్లాలో తాగునీటి అవసరాల కోసం సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు ప్రభుత్వం నీటిని విడుదల చేస్తుందని, వరి రైతుల అవసరాలు, తాగునీటి అవసరాలను తీర్చిన తర్వాత చేపల చెరువులకు సరిపడా నీటిని విడుదల చేయాలని రైతులు ఎంపీకి విన్నవించారు. తక్షణమే స్పందించిన ఎంపీ మహేష్ కుమార్ నీటిని విడుదల చేసి రైతుల అవసరాలు తీర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.